ప్రజాశక్తి

శుక్రవారం 13 జనవరి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

15న వారణాసిలో స్విచ్ ఆన్

- సికింద్రాబాద్ ట్రాక్‌పై రన్
- 'ఏరో డైనమిక్ డిజైన్' వంటి ఆధునిక ఫీచర్లతో 'వందేభారత్' రైలు
- 9 గంటల్లోనే విశాఖ - సికింద్రాబాద్ మధ్య ప్రయాణం
- రైలు సామర్థ్యం 1200 మంది



విశాఖ స్టేషన్‌లో వందే భారత్ రైలు



రైల్లో సౌకర్యాలను పరిశీలిస్తున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

భారతీయ రైల్వేకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (విబిఇ) హై స్పీడ్ రైలు విశాఖ - సికింద్రాబాద్ మధ్య రాకపోకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 15న వారణాసిలో ఉదయం 10.30 గంటలకు దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖకు ఈ రైలు రెగ్యులర్‌గా రానుంది. ఇప్పటికే ట్రయల్ రన్ కూడా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే.

19 నుంచి విశాఖలో ఆరంభం

విశాఖలో ఈ నెల 19 నుంచి ప్రతి రోజూ ఉదయం 5.45 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 2.20 గంటలకు చేరుతుంది. తిరిగి 3 గంటలకు అక్కడ నుంచి బయల్దేరి విశాఖకు రాత్రి 10.45 గంటలకు చేరుతుంది. ప్రతిరోజూ ఉండే రైలు ఇది. థర్డ్ ఎసి కంటే ఛార్జీలు అధికంగా ఉండొచ్చని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. విశాఖ - సికింద్రాబాద్ మధ్య 800 కిలోమీటర్ల దూరాన్ని 9 గంటల్లోగా ఈ వందే భారత్ రైలు చేరుకోనుంది. మామూలు రైళ్ల కంటే మూడు గంటలు దీంట్లో ప్రయాణించేవారికి టైం సేవ్ అవుతుంది. గంటకు 150 నుంచి 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందని తెలుస్తోంది. విశాఖలో ఈ నెల 11న ట్రయల్ రన్ ముగించుకుని గ్యారేజీకి వెళ్తున్న క్రమంలో కంచరపాలెం, రామ్మూర్తి పంతులు బ్రిడ్జి వద్ద ఈ రైలు అద్దాలను కొంతమంది ఆకతాయిలు పగులగొట్టారు. గురువారం రైల్వే అధికారులు తనిఖీలు చేసి పగిలిన రెండు అద్దాలను బాగు చేయించారు. దీంతో విశాఖ-సికింద్రాబాద్ మధ్య రాకపోకలకు మిగతా 2లో..



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ఆదర్శప్రాయుడు వెంకటేశ్వర్లు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఉక్కునగరం : తన కుమారున్ని, చుట్టుపక్కల వారిని పోరాటాలవైపునకు ప్రోత్సహించి, తానూ కడవరకూ ఉద్యమ బాటలో నడిచిన కె.వెంకటేశ్వర్లు ఆదర్శప్రాయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సంస్మరణ సభను దేహదాన ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమంగా మార్చిన సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను అభినందించారు. ఉక్కు నగరంలోని సిఐటియు కార్యాలయంలో కెఎం.శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు సంస్మరణ సభ గురువారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు వెంకటేశ్వర్లుతో తనకు ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. ఆయన్ని ఒక వ్యక్తిగా, ఒక తండ్రిగా, ఒక అమరుడిగా మూడు కోణాల్లో చూడాలన్నారు. ఒక మంచి రైతుగా జీవితాన్ని ప్రారంభించి ప్రత్యేక వ్యక్తిగా ఎదిగారని అన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసి విశాఖ వచ్చి విశాఖపట్నంలోనూ ఖాళీగా ఉండకుండా చెట్లు పెంపకం లేదా ఇతరులకు సహాయం చేయడంతో పాటు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. శరీరం సహకరించకపోయినా ఎన్నో కుటుంబాలతో ముడిపడి ఉన్న ప్లాంటును రక్షించడానికి మిగతా 2లో..

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు శాశ్వత చట్టం

▶ వార్త మెయిన్‌లో..

ప్రియునితో కలిసి భర్తను హతమార్చిన భార్య

▶ వార్త 7లో..

22 ఏళ్లుగా సిఐటియునే గెలుపు

▶ వార్త 8లో..

జిఒ 1 ప్రతుల దగ్ధం



జిఒ కాపీలను దగ్ధం చేస్తున్న కృష్ణారావు, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి ప్రభుత్వం కార్మికోద్యమాలపై అక్రమ నిర్బంధాన్ని ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం సీతమ్మధార, కెఆర్ఎం.కాలనీ, పిఠాపురం కాలనీ, శివాజీపాలెం, పీతలవానిపాలెం ప్రాంతాల్లో మున్సిపల్, ముఠా, తోపుడు బండ్ల కార్మికులు వారి పని ప్రదేశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఒ 1 కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు వి.కృష్ణారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపేందుకు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ చీకటి జిఒను తీసుకువచ్చిందన్నారు. ఇది రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుంటే కార్మికవర్గం చూస్తూ ఊరుకోదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.కుమారి, అనపర్తి అప్పారావు, ఎన్.రమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ : ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను అణగదొక్కేందుకు తీసుకువచ్చిన జిఒ 1ని తక్షణం రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి మిగతా 2లో..

700 రోజులకు 'ఉక్కు' దీక్షలు



నిరసన తెలుపుతున్న ఉక్కు యువ కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారానికి 700వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్దకు భారీగా యువ కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు. సుదీర్ఘకాలంగా పోరాటం సాగుతున్నా కేంద్రంలోని మోడీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. ఈ నెల 30న ఉక్కు నగరంలోని తృష్ణ గ్రౌండ్స్‌లో తలపెట్టిన ఉక్కు ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని కోరారు. వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల మద్దతు తమకు అవసరమన్నారు.

ఒక్క పరిశ్రమనూ స్థాపించని మోడీ ప్రభుత్వం

కలెక్టరేట్ : కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమను ఒక్కటి కూడా ఏర్పాటు చేయలేదని సిఐటియు గోపాలపట్నం జోన్ కార్యదర్శి పి.సత్య నారాయణ అన్నారు. భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయలేని మోడీ ప్రభుత్వానికి ప్రభుత్వ రంగంలోని భారీ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

15న వారణాసిలో స్విచ్ ఆన్

పూర్తిస్థాయిలో ఈ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సిద్ధంగా ఉందని రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి తాజాగా వెల్లడించారు.

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్పీడ్ రైలు పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన రైలు అని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఆధునిక ఫీచర్లతో ఈ రైలు నిర్మాణం చేపట్టారు. ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంట్ సీట్లు 52, కోచ్ కంపార్టుమెంట్‌లో 78 సీట్లును విమానంలో ఉండే మాదిరిగా ఏర్పాటు చేశారు. మొత్తం రైలు స్లెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేయబడింది. స్లైడింగ్ డోర్‌లు, ప్రతి ఒక్కరికీ రీడింగ్ లైట్లను అమర్చే విధానం, మొబైల్ ఛార్జింగ్ పాయింట్స్, అటెండెంట్‌ను పిలిచేందుకు ప్రత్యేక బటన్ సిస్టమ్, బయో టాయ్‌లెట్స్, ఆటోమేటిక్‌గా లోపలకు ప్రవేశం, బయటకు వచ్చే డోర్లు వంటి ఏర్పాట్లు ఉన్నాయి. సిసి టివిలను ఎక్కడికక్కడే కంపార్ట్‌మెంట్లలో అమర్చారు.

పోలీసుల అదుపులో దాడి నిందితులు

ఎంవిపి.కాలనీ : వందే భారత్ రైలుపై దాడి చేసి రెండు కోచ్‌ల్లోని అద్దాలను ధ్వంసం చేసిన నిందితులను రైల్వే పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం సాయంత్రం 5:30 గంటల సమయంలో కంచరపాలెంనకు చెందిన గోశాల శంకర్, అతని మిత్రులు చందు, రాజులు మద్యం సేవించి రైల్వే గేట్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద ఈ వందేభారత్ రైలుపై రాళ్లతో దాడి చేశారు. ఆర్‌పిఎఫ్ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యారు. సిసి ఫుటేజీ ఆధారంగా పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారు. వీరిలో గోశాల శంకర్‌పై నాలుగు ఆస్తి నేరాల కేసులున్నాయి. మదీనాబాగ్‌కు చెందిన టేకేటి చందు జిఆర్‌పి హత్య కేసులో ప్రమేయం కలిగి ఉన్నాడు. వారంతా నేరం అంగీకరించారు.

700 రోజులకు 'ఉక్కు' దీక్షలు

చేపట్టిన దీక్షలు గురువారానికి 652వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖ నగరం అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, లక్షలాది మంది ఉపాధి పొందారని తెలిపారు. అటువంటి గొప్ప కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మడాన్ని అంగీకరించేది లేదన్నారు. దీన్ని తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. దీక్షల్లో సిఐటియు గోపాలపట్నం జోన్ నాయకులు పి.జీవా, డి.పృధ్వీరాజ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వెంకటేశ్వర్లు

ఆయన తన వంతు కృషి చేశారన్నారు. ఆయన్ని అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ ఒక వ్యక్తిగా, రైతుగా వెంకటేశ్వర్లు జీవించిన తీరు ఆదర్శప్రాయమన్నారు. దేహదాన కార్యక్రమానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి సమాజానికి మంచి సందేశం అందించారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.రమేష్ కుమార్, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్లు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, జ్యోతిబసు దేహదాన సంస్థ బాధ్యులు అన్నపూర్ణ, ప్రభావతి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేహదానంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. దేహదానంపై ఆసక్తి ఉన్నవారిని ఆహ్వానించారు.

జిఒ1 ప్రతుల దగ్ధం

ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంపై విశ్వాసం లేదన్నారు. ఇప్పటికైనా జిఒను రద్దు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎం.మన్మధరావు, సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్, జి.వామనమూర్తి, సింహాద్రి పాల్గొన్నారు.

పలు టోర్నమెంట్లకు సాంకేతిక అధికారిగా డివిఎస్‌వై.శర్మ

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : జాతీయ స్థాయిలో జరిగే పలు టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్లకు సాంకేతిక అధికారిగా విశాఖ పట్నంకు చెందిన డివిఎస్‌వై. శర్మ ఎంపికయ్యారు. ఆయన ఈ నెల 30న ఇండోర్‌లో జరగబోయే ఖేలో ఇండియా యూత్ గేమ్‌లకు, 15 నుంచి 20వ తేదీ వరకు వడోదరలో జరగబోయే జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లకు నామినేట్ అయ్యారు. ఈ నెల 7 నుంచి 11 వరకు గోవాలో జరిగిన ప్రభుత్వ రంగ జాతీయ క్రీడలకు సాంకేతిక అధికారిగా పనిచేశారు. ఆయన్ని పలువురు అభినందించారు.


శర్మ (ఫైల్ ఫొటో)

జివిఎంసిలో ఉద్యోగాలు ఇచ్చేందుకు అంగీకారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసిలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో 60 ఏళ్లు దాటిన, రిటైర్ అయిన కార్మికుల కుటుంబాలకు చెందిన వారిని నియమించడానికి ఎలక్ట్రికల్, హెల్పర్, ఫిట్టర్‌లకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించేందుకు జివిఎంసి అధికారులు అంగీకరించారు. గురువారం సాయంత్రం కమిషనర్ ఆదేశాల మేరకు జివిఎంసి చీఫ్ ఇంజినీర్ రవికృష్ణంరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటరావు, సుధాకరరావు, ఇతర అధికారులతో జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, జి.సుబ్బారావు నాయకత్వంలో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ హెల్పర్, టర్న్ కాక్‌లకు సెమీ స్కిల్డ్ వేతనం రూ.18,500 చెల్లించడానికి, 60 సంవత్సరాలకు రిటైర్ అయిన, చనిపోయిన కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించేందుకు, కెనాల్‌పై పనిచేసే సెక్యూరిటీ గార్డు పని ఆధారంగా డిజిగ్నేషన్ మార్చి వారికి సెమీ స్కిల్డ్ వేతనం రూ.18,500 చెల్లించేందుకు, కార్మికులందరికీ వారం సెలవు, 9 పండగ సెలవులు, 15 క్యాజువల్ సెలవులు అమలు చేసేందుకు అధికారులు అంగీకరించారు. 12 నెలల జిఒ ఎరియర్స్ చెల్లించడానికి, మట్టి ఖర్చు రూ.15 వేలు అమలు చేయడానికి అంగీకారం తెలిపారు. సిబ్బందిని పెంచడానికి చీఫ్ ఇంజినీర్ రవికృష్ణ అంగీకరించారు. మొత్తం 23 అంశాలకు సంబంధించి కమిషనర్, కౌన్సిల్ తీర్మానం పంపి అమలు చేస్తామని ప్రకటించారు. ఫిబ్రవరి ఆఖరు తేదీలోగా అంగీకరించిన అంశాలను అమలు చేయాలని, లేకుంటే నగరంలో జరుప తలపెట్టిన జి-20 సమ్మిట్‌కు ముందే సమ్మెకు వెళతామని సిఐటియు నాయకులు స్పష్టం చేశారు. 1030 మందికి సెమీస్కిల్డ్ వేతనాలు ఇస్తే రూ.4 కోట్లు భారం పడుతుందని చెప్పడం సరికాదన్నారు. జనవరిలో కేవలం 5.7 శాతం మాత్రమే జీతం పెరిగిందన్నారు. కాంట్రాక్టు లేబర్ చట్టం, కనీస వేతన చట్టం, ఫ్యాక్టరీల చట్టం, ఎపి గెజిట్ కోడ్ ఆన్ వేజెస్ - 2022 రూల్స్ ప్రకారం వారంతా సెమీ స్కిల్డ్ కిందకు వస్తారని నాయకులు తెలిపారు. నేరుగా కమిషనర్, మేయర్ ముందుస్తు అనుమతి తీసుకొని అమలు చేసి, తరువాత కౌన్సిల్ అమోదం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్చల్లో నీటి సరఫరా యూనియన్ నాయకులు శంకర్రెడ్డి, ఆదినారాయణ, మోహనరావు, వెంకటరావు, చినబాబు, చిన్నారావు, త్రినాథ్, రాజు, సూరిబాబు, సత్యనారాయణ, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు ఉరుకూటి రాజు, టి.నూకరాజు పాల్గొన్నారు.


చర్చల్లో పాల్గొన్న సిఐటియు నాయకులు

మోడీ పాలనలో దేశ ఆర్థికాభివృద్ధి క్షీణత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి పాలనలో దేశ ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తూ ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తోందని, దేశాభివృద్ధి మరింత కుంటుపడుతోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. సిపిఐ విశాఖ జిల్లా సమితి సమావేశం గురువారం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ అధ్యక్షతన ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మోడీ పాలనలో దేశం మునుపెన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లో వెనుకబడిందని, సంపన్న వర్గాల ఆస్తుల రోజురోజుకూ పెరుగుతున్నాయని, పేదవారు మరింత పేదరికంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చేసిన వాగ్దానాలు నేటికీ అమలు కాలేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజెపి ఘోర పరాభావం మూటకట్టుకుందని తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

కలెక్టరేట్ : పితానిదిబ్బలో భవన నిర్మాణ కార్మిక సంఘం, ఐద్వా ఆధ్వర్యాన గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలికలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సింగరావు అధ్యక్షతన సాగిన ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు మణి, వరలక్ష్మి, సత్యవతి, లక్ష్మి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామారావు, సిఐటియు నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

సీతమ్మధార : 43వ వార్డు పరిధి 80 అడుగుల రోడ్డులో సంక్రాంతి సంబరాలులో భాగంగా కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యాన ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను అందరూ సంతోషంగా చేసుకోవాలన్నారు. మీసాల అప్పారావు, జక్కంపూడి సత్యనారాయణ, తిరుపతిరావు, వెంకట్, మాదస్య, గోపి, వల్లి, ఖాదర్, సంతోష్ పాల్గొన్నారు.

తెలుగు జాతి ఐక్యం కావాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కులాల ఔన్నత్యం పెరుగుతున్న తరుణంలో 675 కులాలుగా ఉండి భౌగోళికంగా విడిపోయిన తెలుగుజాతిని ఐక్యం చేసేందుకు సాంస్కృతిక తెలుగు సేన ముందుకు వచ్చిందని, తెలుగు జాతి అంతా ఐక్యం కావాల్సి ఉందని విప్లవ కవి, గాయకుడు గద్దర్ అన్నారు. తెలుగు సేన ఆధ్వర్యంలో విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు సేన అధ్యక్షుడు సత్యారెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాదులో బస్సు యాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దేశంలో 10 రాష్ట్రాలలో భారీ బహిరంగ సభలు, బస్సు యాత్రలు, రోడ్ షోలు కొనసాగుతాయన్నారు. స్మార్ట్ ఫోన్ గ్లోబలైజేషన్‌తో ప్రపంచమంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని అన్నారు

ఘనంగా వివేకానంద జయంతి

ప్రజాశక్తి-విశాఖపట్నం

స్వామి వివేకానంద జయంతినిగురువారం జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

లీగల్ : ఫ్రెండ్స్ అడ్వకేట్స్ అసోసియేషన్ డాబాగార్డెన్స్‌లోని అసోసియేషన్ ఆఫీసులో వివేకానంద జయంతిని నిర్వహించారు. వివేకానంద రచనలు, ఆయన జీవితంపై వివిధ వ్యాసరచన పోటీలు, డిబేట్ పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు అందజేయుటకు నిశ్చయించుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విద్యాశంకర్, ఖండేల్వాల, పి.గోవిందరావు, బగాధి తులసీదాసు, హరిహర రెడ్డి, విజయ్‌కుమార్, సమర్పణరావు, కిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

తగరపువలస : స్వామి వివేకానంద జయంతి ని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవ వేడుకలు సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఎయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ హాజరై మాట్లాడారు. జీవితంలో విజయాలు సాధించేందుకు సరైన మార్గాలు ఎంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ, సివిల్ విభాగాధిపతి డాక్టర్ నరసింగరావు పాల్గొన్నారు.

భీమిలిలో జివిఎంసి, పిఎన్ఎం ఉన్నత పాఠశాలలో జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలో ఒఎస్‌జి ఫౌండేషన్ శివ దళాయి, విబీ హ్యూమానిటీ ఫౌండేషన్ వెంకట్, అల్లూరి సీతారామరాజు ఫౌండేషన్ అరవింద్ చక్రి లోకేష్, జై జవాన్ ఫౌండేషన్ రాజశేఖర్ రామలక్ష్మి ముడసల శ్రీను లోకేష్ ఆధ్వర్యాన జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు



అనిల్ నీరుకొండ ఇంజనీరింగ్ కళాశాలలో నివాళి

గుడిలోవలోవ విజ్ఞాన విహార్, శ్రీ సరస్వతి విద్యా విహార్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి బాలి రవి, ప్రధానోపాధ్యాయులు హెచ్‌బివి.శ్రీనివాసరావు, ఎన్.సాయి బ్రహ్మజీ , ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

ఆనందపురం గ్రామంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు మీసాల రాము నాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ పివివి.ప్రసాదరావు పట్నాయక్, ఉప్పాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన జాతీయ యువజన దినోత్సవ సమావేశం నిర్వహించారు. వివేకానందునిపై నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థిని, బెస్ట్ వాలంటీర్‌గా ప్రశంసలందుకున్న బి.పద్మజ వివేకానందుని జీవిత చరిత్ర, ఆయన బోధనలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, అంజలి దేవి, ఎ.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : ఏయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వివేకానంద చిత్రపటానికి వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళు లర్పించారు. ౧

గీతంలో : స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గీతం విశ్వవిద్యాలయంలో జాతీయ యువజన దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఆవరణలోని సదర్మసదన్‌లో గల వివేకానందుని విగ్రహం వద్ద రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, స్టూడెంట్ లైఫ్ సహయ డైరక్టర్ డాక్టర్ సూరిబాబునాయక్ తదితరులు విద్యార్థులతో కలసి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

నేరాలు ఘోరాలు

వెయ్యి లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో మేడివాడ పంచాయతీ దిడ్డి గ్రామంలో వెయ్యి లీటర్ల నాటుసారా పులుపును గుర్తించి, ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు నాటుసారా బట్టీలపై తమ సిబ్బందితో దాడి చేశామని, అక్కడ డ్రమ్ముల్లో ఉన్న సారాపులుపు పట్టుబడిందన్నారు. నిందితుల ఆచూకీ లేదన్నారు. బాధ్యులను గుర్తించి, వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలు చట్టరీత్యానేరమని, ఎంతటి వారైనా పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

'శ్రీశయన' కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గాజువాక: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న శ్రీశయన సంక్షేమ సంఘం సభ్యులు పాండురంగపురంలోని కీర్తిశేషులు సర్దార్ గౌతు లచ్చన్న నివాసంలో గురువారం సమావేశమై 2023 కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ, శ్రీశయన సంక్షేమానికి తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోడ అప్పారావు మాట్లాడుతూ, శ్రీశయనులు సంఘటితమై సంఘ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి చింతనిప్పుల రాజేంద్ర, విశాఖ జిల్లా అధ్యక్షులు పూతి చంద్రభూషణరావు, నాయకులు శ్రీశైలం, బంటుపల్లి రాజశేఖర్, హరికృష్ణ ప్రసాద్, కోల శ్రీరాములు పాల్గొన్నారు.

సందడిగా దహనం ప్రీ రిలీజ్ ఫంక్షన్

ప్రజాశక్తి -గాజువాక : దహనం ప్రీ రిలీజ్ ఫంక్షన్ గురువారం దువ్వాడ విజ్ఞాన్ కాలేజీలో వైభవంగా నిర్వహించారు. విజ్ఞాన్ యువతరంగ్ వేడుకల్లో భాగంగా నగరంలో ఉన్న పలు కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. ఆటపాటలతో యువత చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ లావు రత్తయ్య, చిత్ర దర్శకులు త్రినాధరావు, దర్శకులు వేరు శంకర్, సినీ నటులు సత్య ప్రకాష్, దహనం నిర్మాత పి.సతీష్‌కుమార్, సహ నిర్మాత సాయి, ఓపెన్ క్లబ్ సంస్థ సిఇఒ వినోద్ పాల్గొన్నారు.

గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎన్ఎంసి కమిటీ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఎన్ఎంసి కమిటీ సభ్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్లలో స్థితిగతులను పరిశీలించేందుకు వచ్చామని చెప్పారు. ఇక్కడ వైద్య విద్యనభ్యసించే విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయని, వీరికి బోధించే లెక్చరర్స్ పనితీరు బావుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గంగాభవాని, రూరల్ హెల్త్ సెంటర్ డిసి ఎస్.ప్రసాద్‌నాయక్, డాక్టర్ భాస్కరరావు, రామారావు, శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్స్ రామకృష్ణ, పార్వతీశం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలను నిర్వహించారు. స్థానిక నాయకులు బంటుపల్లి శ్రీనివాసరావు, బంటుపల్లి సాధూరావు, కోన శ్రీను ఆధ్వర్యాన ఏటా మాదిరిగా సంక్రాంతి పండగను పురస్కరించుకొని క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.10,000, ద్వితీయ బహుమతి రూ.5,000, జ్ఞాపికలను సంక్రాంతి రోజు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో 8 జట్లు పాల్గొన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి బంటుపల్లి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి , సచివాలయ సమన్వయకర్త కోన శ్రీనివాసరావు, పారిశ్రామికవేత్త బంటుపల్లి సాధూరావు, ఆర్గనైజర్స్ దుర్గా నరసింహనాయుడు, రానా, క్రీడాకారులు పాల్గొన్నారు.

గోదా కల్యాణానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-సింహాచలం: కొండవీటి వెంకటేశ్వర స్వామి ఆలయంలో భోగి రోజున గోదా కళ్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే రోజున సాయంత్రం సింహాచలం కొండపైన గోదా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు అర్చక వర్గాలు ఏర్పాటు చేశాయి. 16వ తేదీన కొండ దిగువున గజేంద్రమోక్షమునకు పూల తోట ఉద్యానవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కనుమ రోజున స్వామివారిని మెట్ల మార్గం గుండా కొండ దిగువకు తీసుకొచ్చి ఉద్యానవనంలో గజేంద్రమోక్షం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ తిరువీధులతో నిర్వహించి, అనంతరం కొండపైకి చేరవేస్తారు.

'ఉత్తరం'లో సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు వైసిపి అధ్యక్షులతో వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గురువారం పార్టీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, వార్డు సచివాలయ కన్వీనర్, గృహ సారథులు నియామకం గురించి చర్చించారు. సేవా దృక్పథం కలిగిన, అంకిత భావంతో ప్రజల కోసం పనిచేసే వారిని నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనుక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ ఆలి, కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వి.ప్రసాద్, కెవిఎన్ శశికళ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం తొలగింపు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేటలోని పార్కింగ్ స్థలంలో కట్టిన కట్టడాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ, జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అనధికారికంగా నిర్మిస్తున్న భవనాలను గుర్తించి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకాలు

ప్రజాశక్తి -తగరపువలస : పారుడు వ్యాధి రాకుండా భీమిలి మండలం బోడమెట్టపాలెం, ముద్దాడపేట గ్రామాల్లో ఉన్న 600 గొర్రెలు, 400 మేకలకు పశువైద్య శాఖ అధికారులు టీకాలు వేశారు. గత నెల 26 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు టీకాలు వేసినట్లు దాకమర్రి పశు వైద్య శాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమలో పశు సంవర్ధక సహాయకులు ఎ.సరస్వతి, పి.పైడిరాజు, గోపాలమిత్ర రవి, చిన్నారావు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధే లక్ష్యం : బర్కత్ అలీ



శ్మశాన గోడ పనులను పర్యవేక్షిస్తున్న బర్కత్ అలీ

ప్రజాశక్తి- కంచరపాలెం : వార్డులో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. ముఖ్యంగా వార్డు పరిధి నరేంద్రనగర్‌లో శ్మశాన వాటిక గోడ నిర్మాణ పనులను పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ, వార్డు పరిధిలో ప్రధానమైన సమస్యలపై ఎక్కువగా దృష్టి సారిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. భారీ తుపాన్ కారణంగా కూలిన శ్మశాన వాటిక ప్రహరీపై స్థానికుల విజ్ఞప్తి సుమారు రూ.44 లక్షలు జివిఎంసి నిధులను వెచ్చించి నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇంకా సుమారు రూ.3 కోట్లు వార్డు అభింబూద్ధికి ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

296 జిఓ పట్టాల రిజిస్ట్రేషన్ హక్కులకు వినతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జిఒ 296 ప్రకారం పేదలు, మధ్యతరగతి ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని కొరుతూ జిల్లా సంయుక్త కలెక్టర్‌కు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 296 జిఒ ప్రకారం పట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చిందని, దాన్ని అమలు పరచాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, గాడి సత్యం, పొత్రకండ ధర్మారావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.10.60 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సిఎస్ఆర్ అధికారి నాగరాజు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.సిద్ధార్థకుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్ధార్థ కుమార్ మాట్లాడుతూ, రూ.10.60 లక్షలతో ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యూనిట్ ఆధునీకరణ, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో పంచకర్ల

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను విశాఖ జిల్లా వైసిపి అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ నరసింహారాజు సాదర స్వాగతం పలికారు. ఈ దంపతులు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు.

ప్రాంతీయ కంటి ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రికి అత్యాధునిక పరికరాలు రానున్నాయని ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వమిత్ర తెలిపారు. రామాటాకీస్ వద్ద గల ఆసుపత్రిలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ మల్లికార్జున మంజూరు చేసిన రూ.25 లక్షలతో ఆసుపత్రిలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన 250 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 620 కెవి జనరేటర్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలకు ఉపయోగించే మూడు స్లిట్లు ల్యాంప్‌లు సమకూరాయని, వీటిని త్వరలో జిల్లా కలెక్టర్ ద్వారా ప్రారంభిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవతో హెచ్‌పిసిఎల్ కంపెనీ సిఎస్ఆర్ కింద ఆసుపత్రి అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.28 లక్షలతో గ్లుకోమా వ్యాధిగ్రస్తుల్లో దృష్టి సామర్థ్యాన్ని అంచనా వేసే అత్యాధునిక విజువల్ ఫీల్డ్ ఎనలైజర్ కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రెటీనా సంబంధిత, క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహించడానికి అవసరమైన ఫేకో మిషన్లను రూ.60 లక్షలతో కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. రూ.15 లక్షలతో స్పెషల్ మైక్రోస్కోప్ అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ పరికరాలన్నీ అందుబాటులోకి వచ్చాక కార్పొరేటర్ ఆసుపత్రిలో లభిస్తున్న ఎంతో ఖరీదైన వైద్య సేవలు ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో 90 శాతం వరకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆపరేషన్ కోసం వచ్చేవారికి అరగంటలో వైద్య పరీక్షలు పూర్తిచేసి శస్త్రచికిత్సకు పంపేలా ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కంటి వైద్యానికి సంబంధించి సలహాలు, సూచనల కోసం ఆసుపత్రికి వచ్చేవారికి ప్రతి శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రతిస్పందన సేవలు అందిస్తామని తెలిపారు. నిపుణులైన వైద్యులు సెకండ్ ఒపీనియన్ సేవలు సలహాలు ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న డాక్టర్ విశ్వమిత్ర

పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి -యంత్రాంగం

కలెక్టరేట్ : సగటున 30 శాతం మేర పెంచిన రోడ్డు ట్యాక్స్‌ను తక్షణం రద్దు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ ఒక ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలను రెగ్యులర్‌గా పెంచుతున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో భారం మోపిందన్నారు. లారీ, కారు, ట్రాక్టరు ట్రాలీలకు రోడ్డు ట్యాక్స్‌ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు.

సీతమ్మధార : గూడ్స్ వాహనాలకు పభుత్వం పెంచిన రోడ్ టాక్స్‌ను రద్దుచేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్‌చేశారు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పథకం కింద ఆటోలు, కార్లు, జీపులు, లారీలు కొనుగోలు చేసి నడుపుకుంటూ, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. స్వయం ఉపాధి కింద వాహనాలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై మరిన్ని ఆర్థిక భారాలు వేసేలా గూడ్స్ వాహనాలపై ఆర్థిక భారాలు వేయడం తగదన్నారు. రవాణా రంగాన్ని, మోటార్ వాహన డ్రైవర్లను ఆదుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


కిరణ్‌ను అభినందిస్తున్న బండారు తదితరులు

టిడిపి 94వ వార్డు ప్రధాన కార్యదర్శిగా కిరణ్

ప్రజాశక్తి-పెందుర్తి : మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆదేశాలు మేరకు 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యాన వార్డు కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శిగా మామిడి కిరణ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన మీద నమ్మకంతో పదవి కట్టబెట్టిన బండారు సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేస్తానన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు

నవోదయ కాలేజీ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : శ్రీ నవోదయ జూనియర్ కాలేజీ కేలండర్‌ను ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ బిశెట్టి రామ మాట్లాడుతూ, ప్రతి ఏటా కేలండర్లను ముద్రిస్తున్నట్లు తెలిపారు.

నిర్మల స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-గాజువాక : వడ్లపూడి జాతీయరహదారిలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు పలు వేషధారణల్లో వచ్చి అలరించారు. విద్యార్థులను ముఖ్య అతిథి, పాఠశాల కరస్పాండెంట్ ఫాథర్ రత్నకుమార్, ప్రిన్సిపల్ సిస్టర్ జూలియట్, సిస్టర్ రీతా ఆశీర్వదించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాథర్ రత్నకుమార్ మాట్లాడుతూ, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను పిల్లలకు చిన్నప్పటినుంచే అలవాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నిర్మల స్కూల్ సంక్రాంతి సంబరాల్లో ఫాథర్ రత్నకుమార్, ప్రిన్సిపల్

ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఎన్ఎడి జంక్షన్ వద్ద గల హిస్కీ భవన్‌లో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం గురువారం బిటి మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది డిసెంబర్ 17న కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ కార్మికుల దీక్షా శిబిరం వద్ద చేపట్టిన పెన్షనర్స్ డేని విజయవంతం చేసిన అందరికీ అభినందనలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ, ఢిల్లీలో చేపట్టిన ధర్నా గురించి వివరించారు. సంఘం అధ్యక్షుడు దీనబందు మాట్లాడుతూ, కోర్టు తీర్పును అమలుచేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని విమర్శించారు. కార్పోరేట్లకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తున్న ప్రభుత్వ తీరును ఎండగడుతూ మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ, కనీస పెన్షన్ రూ.9000తోపాటు డిఎ అందరికీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సంఘం బలోపేతానికి తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఇతర సంఘాలని కలుపుకొని విస్తరించాలని కోరారు. హాజరైన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

గాజువాక జంక్షన్‌లో రద్దీ నియంత్రణపై దృష్టి


పాత గాజువాక జంక్షన్

ప్రజాశక్తి -గాజువాక : పాత గాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ జంక్షన్‌లో విపరీతమైన రద్దీ నెలకుంటోంది. ఈ రద్దీని నియంత్రించేందుకు హైవే అధికారులు ఒక కొత్త డిజైన్‌ను రూపొందించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో జంక్షన్‌లో కొంతమేరకు మార్పులు చేపట్టనున్నారు. పాతగాజువాక జంక్షన్‌లో నాలుగు వైపులా ఉన్న డివైడర్లను కొంతవరకు తొలగించి, ఒకేసారి రెండు ఆర్‌టిసి బస్సులతోపాటు, ఒక టూ వీలర్ కూడా సమాంతరంగా వెళ్లేలా వెడల్పు చేయనున్నారు. మరొక పద్ధతిగా ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుతున్న బస్‌స్టాప్‌ను తొలగించి సర్వీస్ రోడ్డులో ఆ బస్టాప్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ రద్దీ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. త్వరలో దీనికి సంబంధించిన శంకుస్థాపన చేయనున్నారు.

'వ్యాపార కేంద్రంగా తిరుపతి దేవస్థానం'

ప్రజాశక్తి-సీతమ్మధార : తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యాపార కేంద్రంగా మార్చేసిందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఆరోపించారు. శ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతితో దేవస్థానం పాలక మండలి తమకు నచ్చినట్లు అతిథి గృహాల్లో భారీగా అద్దెలు పెంచిందని మండిపడ్డారు. ఒక రోజు ఒక గదికి రూ.150 ఉన్న అద్దెను రూ.1,700కు, రూ.200 ఉన్న పెద్ద గది అద్దెను రూ.2,200 పెంచడాన్ని తప్పుపట్టారు. భక్తితో తిరుమలకు వచ్చే భక్తులకు ప్రభుత్వం ఇచ్చే బహుమతి ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే లడ్డు సహా అనేక సేవల ధరలు పెంచారన్నారు. ఆర్జిత సేవల ధరలు పెరిగినా పర్లేదని కొనే వారి స్తోమత, పలుకుబడి బట్టి వారి దర్శనాలు చేసుకొంటున్నారని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులుపెట్టడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మహిళా సత్తా నేతలు ఇనగంటి అనంతలక్ష్మి, వేణిశ్రీ, రూప, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక హుండీ లెక్కింపు

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెం సమీపం బర్మా క్యాంపు వద్ద నున్న నూకాంబిక అమ్మవారి దేవాలయం హుండీని లెక్కించారు. 116 రోజులకు రూ.1,12,242 ఆదాయం వచ్చింది. చాలా కాలం నుంచి హుండీలో ఉండిపోయిన బంగారం, వెండి కూడా లెక్కించారు. బంగారం 18 గ్రాముల 200 మిల్లీ గ్రాములు, వెండి రెండు కిలోల 350 గ్రాములు లభించింది. దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంతకుమార్ పర్యవేక్షణలో, శ్రీవారి సేవకు చెందిన ఎన్.అప్పారావు ఆధ్వర్యాన పలువురు లెక్కింపు చేశారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పి.బుచ్చిబాబు, శర్మ, జెపిఎస్‌కె.శర్మ పాల్గొన్నారు..

అధిక శాతం సుమోటో కేసులు

ప్రజాశక్తి-సిరిపురం : అధిక శాతం సుమోటో కేసుల స్వీకరణతోనే బాలలకు సత్వర న్యాయం జరుగుతుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకట రమణ పేర్కొన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్న ఆయనతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బాలల హక్కులు, పరిరక్షణ వారి సంక్షేమంతో పాటు దురదృష్టకర సంఘటనలు, పరిణామాలు చోటుచేసుకున్నట్లు ప్రసార సాధనాల్లో వచ్చే వార్తలను, అందిన ఫిర్యాదుల్లో నూరు శాతం వాస్తవ ఆధారాలున్నట్లు భావిస్తే వాటిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సుమోటోలుగా స్వీకరించాలని సూచించారు. లోక్‌సభ, రాజ్యసభల ఆమోదంతో ఏర్పడ్డ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టబద్ధంగా ఎంతో శక్తివంతమైనదని తెలిపారు. బాలలకు పూర్తి న్యాయం జరిగేలా బాధ్యతగా చర్యలు చేపడితే పిల్లల్లో, వారి తల్లిదండ్రుల మోముల్లో చిరునవ్వులు చూడవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం మాట్లాడుతూ, న్యాయమూర్తి సూచించిన ప్రతి అంశాన్నీ కమిషన్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లి అమలుపర్చే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ భేటీలో బాలల సంఘ నాయకుడు బొడ్డేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 85వ వార్డు పరిధి ఫార్మా పునరావాస కాలనీలో మహిళలకు లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యాన 50 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లుపిన్ సైట్ హెడ్ రాజేష్ తేటే మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు లుపిన్ ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా స్థానిక యువత, మహిళలలో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. లుపిన్ ఫౌండేషన్ ద్వారా 90 రోజుల టైలరింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సంవత్సరం శిక్షణ పొందిన 90 మంది మహిళలకు 50 శాతం సబ్సిడీతో కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధికి లుపిన్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైసిపి నాయకులు ఇల్లపు వరప్రసాద్, లుపిన్ లిమిటెడ్ డిజిఎం ఎన్.శ్రీనివాసరావు, సిఎస్ఆర్ మేనేజర్ డి.వెంకటనారాయణ, టీచర్ అరుణకుమారి పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిర్వాసితుల సమస్య పరిష్కారం

పరిహారం పెంపునకు అంగీకారం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితుల సమస్య ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. రైతుల విజ్ఞప్తి మేరకు పరిహారం పెంపునకు అధికారులు అంగీకరించారు. రోడ్డు విస్తరణ బాధితులకు పరిహారం చెల్లింపుపై 2023 డిసెంబర్ 8న మునగపాక మండల పరిషత్తు సమావేశ మందిరంలో పూర్తి స్థాయిలో నిర్వాసితుల లేకుండా ఆర్‌డిఒ చిన్ని కృష్ణ సమావేశం నిర్వహించగా అది అర్ధాంతరంగా ముగిసింది. పంట భూములకు గజానికి రూ.5,600, వాణిజ్య సముదాయాల భూములకు రూ.14,700 పరిహారం చెల్లిస్తామని నాడు ఆర్‌డిఒ చెప్పడంతో నిర్వాసితులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆర్‌డిఒ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయారు. ఈ పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో నిర్వాసితులతో సమావేశం


రోడ్డు నిర్వాసిత సంఘం నాయకులు

నిర్వహించాలని, మెరుగైన ప్యాకేజీని ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వాసితుల సంఘం కన్వీనర్ బ్రహ్మాజీ నిర్వాసితులతో కలిసి డిసెంబరు 23న ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎట్టకేలకు ఆర్‌డిఒ చిన్నికృష్ణ గురువారం అధికారికంగా ప్రకటన చేసి చర్చల్లో పాల్గొన్నారు. పంట భూములకు గజానికి రూ.6,148, వాణిజ్యసముదాయాల భూములకు రూ.15,200 ఇస్తున్నట్లు చెప్పారు. దీంతో నిర్వాసితులు పరిహారాన్ని అంగీకరించక, భూములు ఇచ్చేదే లేదని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో తుది నిర్ణయంగా పరిహారం మీరే నిర్ణయించుకోవాలని ఆర్డీవో సూచించడంతో నిర్వాసితులు పంట భూములకు గజానికి రూ.11,000, వాణిజ్య సముదాయాల భూములకు రూ.18,000 చెల్లించాలని ముక్తకంఠంతో తెల్చి చెప్పారు. వారు కోరిన పరిహారాన్ని చెల్లించేందుకు ఆర్‌డిఒ చిన్నికృష్ణ అంగీకారం తెలిపారు. నిర్వాసితుల సమస్యలపై ప్రారంభం నుండి అగ్ర భాగాన నిలిచిన నిర్వాసితుల సంఘం కన్వీనర్ బ్రహ్మాజీని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘ ప్రతినిధులు పొలిమేర గణేష్, బొడ్డేడ సోమసుందరరావు, పెంటకోట జగన్నాథరావు, ఎవి సత్యనారాయణ, వేగి వీరి నాయుడు, ఆడారి పోలయ్య, పెంటకోట కాశి, బీశెట్టి మాధవ, సూరిశెట్టి నారాయణరావు, పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

74వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఒబి నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం గ్రామం వద్ద నేవీ గేట్ ముందు నిర్వహిస్తున్న ఆందోళన గురువారం నాటికి 74వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ 74 రోజులుగా నిర్వాసితులు ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ గుండా చేపల వేటకు అనుమతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 8 గ్రామాల నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చీకటి జిఒపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్లపై సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్ షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 1 ప్రతులను ఏఐటియుసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సర్వసామదాంబ పార్కు సెంటర్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం మాట్లాడుతూ ప్రజల గొంతు నొక్కే జిఒ నెంబర్ 1ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడో ఒకటి అరో ప్రమాదాలు జరిగితే వాటిని భూతద్దంలో చూపించి ఇటువంటి జీవోలు తేవడం రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులను హరించడమేనని తెలిపారు. ఈ జీవో రద్దు చేయాలని ఇప్పటికే సిపిఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు శ్రీరామదాసు అబ్బులు, తాకాసి వెంకటేశ్వరరావు, ముక్కామల చిన్న, శరగడం సుబ్రహ్మణ్యం, గణేష్, అంబికేశ్వరరావు, మద్దాల రాము, కోరిబిల్లి శంకర్రావు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేసినట్లు జీవీఎంసీ 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకి రామరాజు అన్నారు. గురువారం జీవీఎంసీ అధికారులతో కలసి నరసింగరావుపేట చవితిన వీధిలో రూ.30 లక్షలతో నిర్మించిన రహదారులు, కాలువ పనులను ఆమె పరిశీలించారు. పాత కరెంట్ ఆఫీస్ వీధిలో రూ.27 లక్షలతో నిర్మాణం జరుగుతున్న రహదారులు, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టిన కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కూండ్రపు సత్తిబాబు, చింత రాంజీ, చవితిన సూకరాజు, కోన ఉమా, పేలూరు కళ్యాణ్, సతీష్ రెడ్డి, దొంక సత్తిబాబు, ఈదలపాక శివ తదితరులు పాల్గొన్నారు.

12 టన్నుల పశు దాణా పంపిణీ

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని నూతన గుంట్ల పాలెం, తీడ, అచర్ల, కొత్తపల్లి రైతు భరోసా కేంద్రాలలో గురువారం 12 టన్నుల సమీకృత మిశ్రమ దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి సిహెచ్.చైతన్య మణి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఈ మిశ్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తులసీరావుకు నివాళి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ఇటీవల మృతి చెందిన విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు సంతాప సభ మండలంలోని మూలపేట గ్రామంలో గురువారం జరిగింది. మూలపేట పాలకేంద్రం వద్ద పాల సేకరణ కేంద్రం అధ్యక్షులు కాండ్రేగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడి రైతులకు తులసీరావు చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం విశాఖ డెయిరీ ద్వారా మంజూరు చేసిన సంక్రాంతి బోనస్ రూ.3,60,000 రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు, జోనల్ మేనేజర్ శరగడం రమణ, సూపర్వైజర్ కొణతాల ఆది అప్పారావు, మాజీ అధ్యక్షులు శరగడం నాగేశ్వరరావు, డైరెక్టర్లు ఆడారి రామకోటి, కాండ్రేగుల ఆదినారాయణ, తులసీరావు అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శ్రీకర్ ప్రతిభ


కృష్ణ శ్రీకర్

దేవరాపల్లి : కేరళ రాష్ట్రం, కొచ్చిన్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 9 నుంచి 14 వరకు జరుగుతున్న సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ ప్రతిభ కనబర్చారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీకర్ సంగివలస శశి స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. గత నెల కాకినాడలో జరిగిన స్టేట్ మీట్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటి కేరళ నేషనల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీకర్‌ను స్కూల్ యాజమాన్యం, ఫెన్సింగ్ సంఘం నాయకులు అభినందించారు. శ్రీకర్ కుటుంబం వృత్తి రీత్యా ప్రస్తుతం పెందుర్తిలో నివాసం ఉంటుంది. వీరి స్వస్థలం దేవరాపల్లి మండలం, చిననందిపల్లి గ్రామం. తండ్రి జిఎన్ మూర్తి కాంట్రాక్టర్ కాగా, తల్లి డాక్టర్ ఎస్‌బిటిఎస్ దేవి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. ఈమె రాష్ట్ర స్థాయిలో పలు ప్రజా సంఘాలకు నాయకత్వం వహిస్తున్నారు.

కష్టించి పనిచేసే వారికి గుర్తింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీలో కష్టించి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని రొంగలివానిపాలెం గ్రామంలో గురువారం కాఫీ విత్ కేడర్ కార్యక్రమం నిర్వహించారు. అధికార వైసిపి అవినీతిపై సమిష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రొంగలి సూరిబాబు, పల్లెల నాగేశ్వరరావు, ఎంఎస్ఎన్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతగల అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి-అనకాపల్లి : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనతి కాలంలోనే కీర్తిశేషులు డబ్బీరు చంద్రశేఖర్ నిబద్ధత గల అధికారిగా అందరి మన్ననలు అందుకున్నారని ఎంపిపి గొర్లి సూరిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం చంద్రశేఖర్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులతో, సిబ్బందితో ఆయన మెలగిన తీరు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి భీశెట్టి జగన్, తహశీల్దారు గంగాధర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు జోసెఫ్, ఈవోపీఆర్‌డి ధర్మారావు, వైస్ ఎంపీపీలు సూర్య కుమారి చంద్రశేఖర్, ఆనంద రాము, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.


ఎంపిడిఒ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళన


డిటి రమేష్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గురువారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు జి.కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కేంద్రాల పరివేక్షణ పేరుతో వేధింపులు, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషక మెనూ ఛార్జీలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని కోరారు. ర్యాలీలు, సభలు నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ వన్ వెంటనే రద్దు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.భవాని, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న రత్నాకర్ దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భోగి మంటలు, హరిదాసు సంకీర్తనలు, తోడు పెద్దల సేవ, విద్యార్థులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకర్షించాయి. ఈ సందర్భంగా సంక్రాంతి విశిష్టతను రత్నాకర్ తెలియజేశారు. కళాశాల గవర్నమెంట్ బాడీ మెంబర్ దాడి అచ్యుత వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్ల నర సింహం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కె ఎస్ ఈశ్వరరావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గాయత్రి హైస్కూల్‌లో...

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం గాయత్రి ప్రైమరీ, హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల వేషధారణతో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాలికల రంగులు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. భోగి మంట వేసి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు బినాల అప్పారావు, కరస్పాండెంట్ రామ్ కుమార్, ప్రిన్సిపాల్ నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


సంప్రదాయ వేషధారణలో చిన్నారులు

త్వరితగతిన సచివాలయ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల మేజర్ పంచాయతీ సచివాలయం-2 నిర్మాణ పనులు త్వరితన పూర్తి చేయనున్నట్లు సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు తెలిపారు. గురువారం ఆయన సచివాలయం స్లాబ్ పనులకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ సత్యవతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ సహకారంతో తుమ్మపాల గ్రామంలో ఇప్పటికే గుండాల వీధి నుంచి తుమ్మపాల వరకు సెంట్రల్ లైటింగ్ పూర్తి చేశామని తెలిపారు. వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, వార్డు మెంబర్లు తర్ర సత్యారావు, చదరం చిన్న, పంచాయతీరాజ్ ఏఈ రాజకుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి నాయకులు పివిజి.కుమార్

జగన్ పాలనలో అన్ని వర్గాలకు నష్టం

ప్రజాశక్తి- దేవరాపల్లి : రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి చేతకాని పాలన వల్ల అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారని తెలుగుదేశం పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు అన్నారు. బుధవారం రాత్రి దేవరాపల్లి మండలంలోని చింతలపూడి, తామరబ్బ పంచాయతీలలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల పాత్రునాయుడు, కర్రి సింహాద్రి నాయుడు, బండారు రామారావు, చల్లా నానాజీ, తేడా చిన్నారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతతో పని

ప్రజాశక్తి -అనకాపల్లి : ఉపాధ్యాయులు వత్తి నిబద్ధత, సామాజిక బాధ్యతతో పని చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి మధు పిలుపునిచ్చారు. స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గురువారం డిటిఎఫ్ జిల్లా నాయకులు కెఎస్ఎస్ సాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధు మాట్లాడారు. బోధన కర్తవ్యాల నిర్వహణతో పాటు విద్యారంగ సమస్యలపై ఉద్యమించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. అనంతరం సంఘం అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెఎస్-ఎస్.సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎన్‌వి రమణమ్మ, ముర్ల దేవుడు, ప్రధాన కార్యదర్శిగా కొల్లి రాజు, కార్యదర్శులుగా మునిస్వామి, ఎం వెంకట అప్పారావు, ఊసా సన్యాసి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జీవిబిఎ రాజు, రాష్ట్ర కౌన్సిలర్‌గా మధు ఎన్నికయ్యారు.

బుక్ కీపింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమ్మదులపాలెం గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బుక్ కీపింగ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎమ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘం సభ్యుల పొదుపు, అప్పులు, రుణాలు జమ, చెల్లింపులు వంటివి నిర్వహించడం, బక్ రాయడంపై తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న స్త్రీ నిధి, చేయూత, ఆసరా, హౌసింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ రామకృష్ణ, విఓఏ కుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-చోడవరం : పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ ఎన్ఎస్ఎన్ రెడ్డి అన్నారు. స్థానిక కెవిఆర్ ఫంక్షన్ హాల్లో గ్రామీణ వైద్యుల అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ పౌష్టికాహారంతో మనిషి ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. గ్రామీణ వైద్యుల ద్వారా గ్రామాల్లో విశిష్టమైన సేవలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 50,000 మంది వైద్యులు పనిచేస్తున్నారని. వీరందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జీవో ప్రకారం నడుచుకుంటూ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు దొడ్డి అమిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జోషి, ఎం తిరుపతిరావు, డివిజన్ అధ్యక్షులు ఎం.రాజు, జిల్లా అధ్యక్షులు ఆడారి రమణ, కార్యదర్శి ఈశ్వరరావు, శ్రీనివాసరావు, పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దంత వైద్యులు డాక్టర్ ఎన్ఎస్ఎన్ రెడ్డి

చిరుధాన్యాల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ జగన్నాథరావు



మాట్లాడుతున్న డాక్టర్ జగన్నాథరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె.జగన్నాధ రావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో గురువారం జరిగిన శిక్షణ, సందర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. ఆహార ధాన్యాల్లో చిరుధాన్యాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల వ్యవసాయ అధికారులు అపల స్వామి, మోహన్ రావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రబీ సీజన్లో వరి, అపరాలు, చిరుధాన్యాలు అధిక ఉత్పత్తికి కృషి చేయాలన్నారు పలువురు వ్యవసాయ సహాయ సంచాలకులు మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆత్మ పిడి ఆశాదేవి మాట్లాడుతూ చెరకు వంటి పంటలలో యాంత్రికరణ ప్రోత్సహించి, రాగి వేరుశనగ వంటి పంటల్లో ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పంటల క్షేత్రస్థాయి సమస్యలపై కెవికె, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, ఏరువాక శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ముకుందరావు, భవాని, విశాలాక్షి, ఆదిలక్ష్మి, సరిత, శ్రీదేవి, రామలక్ష్మి, కుసుమ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

తమ గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీకి మండలంలోని కందిపూడి గ్రామస్తులు కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం కందిపూడి పంచాయతీలో ధర్మశ్రీ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను ఏకరు పెట్టారు. డ్రైనేజీ పూర్తిస్థాయిలో లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి రావడంతో దోమల స్వైర విహారం చేస్తున్నాయని వాపోయారు. సగంలో ఆగిపోయిన డ్రైనేజీని పూర్తి చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపిడీవో సువర్ణ రాజును ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొప్పాక సత్యవతి గణేష్, వైసిపి మండల అధ్యక్షులు కొలిమల్ల అచ్చం నాయుడు, స్థానిక ఎంపీటీసీ సీత వరలక్ష్మి సన్యాసినాయుడు, బుచ్చయ్యపేట పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు, పలు గ్రామాల నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కందిపూడిలో పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

హత్యా నేరంలో ఏడు సంవత్సరాల జైలు

ప్రజాశక్తి- కె.కోటపాడు


దేవుడునాయుడు

వరసకు చెల్లెలు అయిన యువతితో ప్రేమాయణం కొనసాగించి, పథకం ప్రకారం హత్య చేసి రహస్యంగా గోతిలో పూడ్చిన నేరంలో ముద్దాయికి చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. కె.కోటపాడు ఎస్సై ధనుంజయ్ కథనం ప్రకారం... దేవరాపల్లి మండలం వెంకటరాజుపురం గ్రామానికి చెందిన లెక్కల దేవుడు నాయుడు, కె.కోటపాడు మండలం ఆర్లే గ్రామంలో కోళ్ల ఫారం అద్దెకి తీసుకుని నిర్వహిస్తుండేవాడు. వెంకటరాజుపురం గ్రామానికి చెందిన వరసకు చెల్లెలు అయిన లెక్కల సంధ్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పుడు సంధ్య నర్సింగు కోర్సు చదివేది. కాలేజీకి వెళ్తున్నట్లు ఇంట్లోకి చెప్పి లెక్కలు దేవుడు నాయుడు వద్ద ఉండిపోయేది. ఈ విషయం తెలిసి పెద్దలు పలుమార్లు మందలించారు. ఈ నేపథ్యంలో 2018 ఆగస్టు 15వ తేదీన ఆర్లే గ్రామంలో కోళ్ల ఫారం వద్ద సంధ్య మృతి చెందింది. ఆ మృతదేహాన్ని రహస్యంగా కోళ్ల ఫారంలోనే ఒక పెద్ద గొయ్యి తీసి పూడ్చి పెట్టడానికి ముద్దాయి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. వెంకటరాజుపురం గ్రామానికి చెందిన బండారు భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై ఎన్ని రమణ కేసు నమోదు చేశారు. ముద్దాయిపై ఐపిసి సెక్షన్ 306, 201 ప్రకారం కేసు ఫైల్ చేశారు. పలువురు సాక్షులను విచారించిన మీదట ముద్దాయి చేసిన నేరం రుజువైనందున గురువారం చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్ అరుణశ్రీ ఏడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షను విధించారు.

కాలినడకన సింహాచలం యాత్ర

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సింహాద్రి అప్పన్న మాలలు వేసుకున్న భక్తులు 41 రోజులు దీక్ష పూర్తి చేసుకొని ఇరుముడులు కట్టుకొని గురువారం కాలినడకన సింహాద్రి అప్పన్న దర్శనానికి కాలినడకన సింహాచలం బయలుదేరారు. 20 ఏళ్లగా ప్రతి ఏటా వంద మంది వరకు గ్రామంలో సింహాద్రి అప్పన్న మాలలు ధరించి సింహాచలం కొండపైకి కాలి నడకన వెళ్లటం ఆచారంగా వస్తుందని గురుస్వామి భీమర శెట్టి అప్పారావు తెలిపారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి మళ్ల వరహానరసింహారావు, పి. రామజోగి నాయుడు, కొయిలాడ దశావతారం, ఎం.శేషుబాబు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.

యువతకు వివేకానంద స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్వామి వివేకానంద నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు అన్నారు. వివేకానంద 121 జయంతి సందర్భంగా గురువారం గొల్ల వీధిలో వివేకానంద విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత వివేకానందునికే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బోడి వెంకటరావు, కోట్ని రాంబాబు, మారిశెట్టి శంకర్రావు, బొడ్డేడ మురళి, కాండ్రేగుల సత్యనారాయణ, పాలిమేర ఆనంద్, బర్నికాన శ్రీనివాసరావు, వి రమణ బాబు, బి భువనేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పివి రమణ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చే ఆధ్యాత్మిక గురువు స్వామి వివేకానంద అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, వాలంటీర్లు చందు నారాయణమూర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్వామి వివేకానంద ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పైలా ఫౌండేషన్ అధినేత పైలా ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక షిరిడి సాయిబాబా ఆలయం ప్రాంగణంలో కె.కోటపాడు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన వివేకానంద 160వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పైలా ప్రసాద్‌రావు, సీనియర్ జర్నలిస్ట్ కుబిరెడ్డి రాధాకృష్ణలను శాలువాతో సత్కరించారు. ఆలయ ప్రాంగణంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యలమంచిలి ధర్మారావు, నేమాల సతీష్, కుబిరెడ్డి సన్నిబాబు, గజ్జెల గంగాధర్, నీలి శ్రీనివాసరావు, శిలపరశెట్టి వెంకట్రావు, వేగి రామారావు, నాయకులు బండారు నరసింహానాయుడు, వెలగల పైడం నాయుడు, ఫ్యాషన్ టెక్నాలజీ శ్రీనివాసరావు, భూపతి అప్పలరాజు, గజ్జి అప్పలనాయుడు, బండారు గడ్డి బాబు, పిల్లల రమణ, వేగి ఆదినారాయణ పాల్గొన్నారు.

వడ్డాది : స్వామి వివేకానంద మాటలు ప్రగతికి బాటలు అని అతిథి దేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు అన్నారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేడీ జడ్పీ హైస్కూల్లో గురువారం వివేకానంద విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, పేదలకు వస్త్రాలు దానం చేశారు. వడ్డాది, దిబ్బిడి, కేజె.పురం, చిన్న అప్పన్నపాలెం, వీరవెల్లి అగ్రహారం, బంగారు మెట్ట, ఎల్‌బిపి.అగ్రహారం, విఆర్ఆర్ పేట గ్రామాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు డాక్టర్ దుర్గేష్ కుమార్ పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద 160 జయంతిని నిర్వహించారు. స్వామి వివేకానందుని చిత్రపటానికి ఉపాధ్యాయులు సతీష్ పూలమాలవేసి నివాళులర్పించారు..వివేకానందుని జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎ. అప్పలరాజు, సిబ్బంది వి. రమణమ్మ పాల్గొన్నారు.


కె.కోటపాడులో నివాళులర్పిస్తున్న పైలా, పాత్రికేయులు

నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖ గ్రంథాలయంలో వివేకానందుని చిత్రపటానికి లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పి హైస్కూల్ ఉపాధ్యాయుడు నారాయణరావు పాల్గొని, వివేకానందుని ఆశయాలు, ఆదర్శాలను వివరించారు. ఇన్‌ఛార్జి లైబ్రేరియన్ రాజబాబు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు.

ఎస్ రాయవరం : యువత ఉజ్వల భవిష్యత్తుకు వివేకానందుడి జీవితం ఆదర్శంగా నిలుస్తుందని రామకృష్ణ సేవాసమితి ఆర్గనైజర్ కొరుప్రోలు రమణ అన్నారు. గురువారం ధర్మవరంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి వైస్ ప్రెసిడెంట్ కలిగట్ల మాణిక్యం,మాజీ వైస్‌ప్రెసిడెంట్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్ (నాని), పడాల మణికంఠ, బత్తిన అప్పారావు పాల్గొన్నారు.

గొలుగొండ : పాతకృష్ణదేవిపేటలో స్వామి వివేకానంద జయంతిని సర్పంచ్ పందిరి సత్యంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ గ్రామ యువకులు పాల్గొన్నారు.

సంక్షేమ లబ్ధితో ముందే సంక్రాంతి



గడపగడపలో ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : రాష్ట్రప్రభుత్వం అందించిన ఆర్థికసంక్షేమ లబ్ధితో గ్రామాల్లో సంక్రాంతిశోభ ముందే వచ్చేసిందని ఎమ్మెల్యే గొల్లబాబూరావు అన్నారు. గురువారం కొరుప్రోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దళితకాలనీ మెట్ట మీద, తదితర ప్రాంతాలలో సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిఎం జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడంతో ప్రజలంతా ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతిని జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు చేకూరి శ్రీరామచంద్రరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, నూకునాయ్డు, కొర్ని రాజారమేష్, మామిడి చంటి పాల్గొన్నారు.

ఐఒబి బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం

ప్రజాశక్తి- నక్కపల్లి : స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వెలుగు ఎపిఎం ఉషాదేవి ఆధ్వర్యంలో ఐఒబి బ్యాంక్ మేనేజర్ రవీంద్రను ఘనంగా సత్కరించారు. 212 మహిళా సంఘాలకు రూ.32 కోట్లు బ్యాంకింగ్ లావాదేవీలు జరిపిన మేనేజర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ కరుణానిధి, సిసిలు రాజు, ప్రకాష్, అప్పారావు పాల్గొన్నారు.

మకరజ్యోతి ఉత్సవానికి పందిరిరాట

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక అయ్యప్ప దేవాలయంలో మకర జ్యోతి ఉత్సవాలకు గురువారం పందిరిరాట వేశారు. 40ఏళ్లుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా ఆలయ ధర్మకర్త మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మకరజ్యోతి వేడుకలో భాగంగా సంక్రాంతి రోజుల ఆదివారం ఉదయం నుంచే అయ్యప్పస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలతోపాటు కేరళ వాయిద్యాలతో స్వామి రథోత్సవం, ప్రజల వినోదానికి జబర్దస్త్ , బుల్లితెర నటులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించే పనిలో కమిటీ ఉంది. పందిరిరాట అయ్యన్న సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ పద్మావతి, విజయ్, కౌన్సిలర్ రాజేష్ పాల్గొంటున్నారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న తిరువీధి

ప్రజాశక్తి -నక్కపల్లి :ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా గురువారం రాజాధిరాజ వాహనంలో శ్రీనివాసుడు, చిన్న పల్లకిపై గోదాదేవి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా పుష్ప తోటలో నీరాట్టోత్సవాలలో భాగంగా గోదాదేవి అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

వైసిపి సభ్యత్వానికి రొంగలపాలెం సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని రొంగలపాలెం సర్పంచ్ లోవరాజు వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఎంపిపి శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి రమణమ్మకు అందించారు. అధికారపార్టీలో చేరితే గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చన ఆశతో వైసిపిలో చేరానని, అయినా తనకు సరైన గుర్తింపులేదు సరికదా, కనీసం అభివృద్ధి చేసుకోలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు అభివృద్ధి చేయలేని స్థితిలో నిస్సహాయతతో రాజీనామా చేశానన్నారు.

డబ్బులిచ్చిన వారికే జగనన్న ఇళ్లు

మండల సభలో ఎంపిటిసిల పరస్పర ఆరోపణలు.. రసాభాసగా సమావేశం



ఎంపిటిసిలను సముదాయిస్తున్న ఎంపిపి, వైస్ ఎంపిపి

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎఎల్‌పురానికి చెందిన ఎంపిటిసిల మధ్య ఆద్యంతం వాగ్వాదంతో మండల సభ రసాభాసగా మారింది. గురువారం ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జగనన్న కాలనీల్లో డబ్బులు ఇచ్చిన వారికే ఇళ్లు మంజూరు చేశారని ఏఎల్‌పురం-3 చింతల బుల్లిప్రసాద్‌పై ఏఎల్‌పురం-1 ఎంపిటిసి రుత్తల శివరామకృష్ణ ఆరోపణలు చేశారు. సంబంధిత జెఇ వివరణ ఇస్తున్న సమయంలో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుసుకుంది. ఏఎల్‌పురం-3 ఎంపిటిసి చింతల బుల్లిప్రసాద్‌కు కల్వర్టు నిర్మాణం పూర్తికాకుండానే ఇంజనీరింగ్ అధికారులు చెల్లింపులు చేశారని ఏఎల్‌పురం -1 ఎంపిటిసి రామకృష్ణ ఆరోపించారు. పని పూర్తి చేసినప్పటికీ తొమ్మిది నెలలౌతున్నా బిల్లులు చెల్లింపుల్లో ఇంజనీరింగ్ అధికారులు తాత్కారం చేస్తున్నారని ప్రశ్నించారు. సచివాలయ నిర్మాణాల విషయంలో కూడా ఇద్దరు ఎంపిటిసిలకు తీవ్ర వాగ్వివాదం జరిగింది. దీంతో ఇది మండల సర్వసభ్య సమావేశమా లేదా ఏఎల్‌పురం పంచాయతీ సమావేశం అంటూ మిగిలిన సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిపి మణికుమారి, వైస్ ఎంపిపి ఆదినారాయణ ఇరువురిని సముదాయించడంతో వివాదం సద్దుమణిగింది. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో కొద్దిగా అలసత్వం జరిగిందని, 1:2 నిష్పత్తిలో ధాన్యం కొనుగోలు చేయాలనే అనుమతులు వారం పది రోజుల్లో ప్రభుత్వం నుంచి వస్తాయని, వెంటనే రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్, విద్యా, విద్యుత్, వైద్యం, నాడునేడు పనులు, ఉద్యానశాఖ, ఐసిడిఎస్, గృహనిర్మాణాలపై శాఖల వారీగా సమీక్ష జరిగింది. 15 మంది ఎంపిటిసిలకుగాను కోరంకు సరిపడా ఎనిమిది మంది మాత్రమే హాజరయ్యారు.కొన్ని శాఖల అధికారులు కూడా హాజరు కాకపోవడంతో మండలసభ మొక్కుబడిగా సాగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ డేవిడ్‌రాజు, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, ఏఎంసి అధ్యక్షులు కొల్లు సత్తిబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీను, ఇఒపిఆర్‌డి రఘురామ్, గొలుగొండ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్, హౌసింగ్ ఎఇ గోపి పాల్గొన్నారు.

కుళాయిలు వేస్తామన్నారే గానీ, నీరిస్తామనలేదుగా..?

మండల సభలో ప్రభుత్వం, అధికారులపై వైసిపి సభ్యుల వ్యంగ్యాస్త్రాలు



మండల సభలో సభ్యుల పరస్పర వాగ్వాదం

ప్రజాశక్తి-రోలుగుంట : జలజీవన్ మిషన్ పనుల్లో అలసత్వంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని పరిస్థితుల్లో, అధికారులపై అధికార వైసిపి ఎంపిటిసిలు వ్యంగ్యాస్త్రాలు సంధించి, హేళనగా నవ్వుకునే అరుదైన పరిస్థితి గురువారం రోలుగంట మండల సభలో చోటుచేసుకుంది. ఉదయం 11గంటలకే ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన అధ్యక్షతన సమావేశం ప్రారంభమైనప్పటికీ, కోరానికి సరిపడా సభ్యులు లేక, ఎమ్మెల్యే ధర్మశ్రీ వస్తారని ఎదురుచూస్తూ గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది.ఈ సందర్భంలో అధికార వైసిపి ఎంపిటిసిలు, సర్పంచ్‌లే జలజీవన్ మిషన్ పనుల్లో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, ప్రభుత్వాన్ని విమర్శించలేని పరిస్థితుల్లో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జరిగిన చర్చలో జలజీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిలు వేస్తామన్నారేగానీ, నీరిస్తామని చెప్పలేదుగా అంటూ అధికారుల తీరుపై ఆరోపణలు గుప్పించి నవ్వుకున్నారు. ప్రభుత్వంపై ఉన్న ఉక్రోషాన్ని అధికారులపై చూపించారు. వైసిపికి చెందిన కుసర్లపూడి సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు, మరికొందరు సభ్యులు ఏకంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్.వెంకటరాజు, ఉపాధి ఎపిఒ సూర్యమణి, హౌసింగ్ ఎఇ ప్రేమానందంపై ధ్వజమెత్తారు. జలసిరి పథకంలో 72 బోర్లు మంజూరు అయితే 31 బోర్లు వేశారు. వాటికి కరెంట్ కనెక్షన్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో భూమిని చదును చేసే పనులకు సంబంధించి రూ.ఐదు లక్షల బిల్లులను మూడు సమావేశాల్లోనూ ప్రస్తావించినా చెలించపకోవడంపై సభ్యులు మండిపడ్డారు. దీనిపై ఎపిఒ స్పందిస్తూ, ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే చెల్లిస్తామని నిరాసక్తత వ్యక్తం చేశారు. కంచుగుమ్మల సత్యనారాయణ స్వామి గుడికి 11.80ఎకరాల భూమి మాత్రమే ఉంటే, ఇతర రైతులను భూమిని కలుపుకుని ఆన్‌లైన్‌లో 62 ఎకరాలున్నట్లు చూపిస్తున్నారని ఆరు నెలలుగా కాకినాడ ఎండోమెంట్ బోర్డుతోపాటు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు మండల సభల్లో పలుమార్లు ప్రస్తావించినా సమస్య పరిష్కరించడం లేదని కంచుగుమ్మల సర్పంచ్ బండారు శ్రీనివాసరావు తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు విన్నవించి ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్‌కు రాయడం జరిగిందని తహశీల్దార్ బదులిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకరరావు, మండల శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి - రావికమతం : ప్రకృతి వ్యవసాయంపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని గర్నికం క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల అన్నారు. గురువారం కెబిపి.అగ్రహారం గ్రామంలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల అనుసంధానంతో మహిళా, గ్రామ సంఘాలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు.ద్రవ, ఘన జీవామృతం, పుల్లటి మజ్జిగ, నీమాస్త్రం లాంటి కషాయాలతో తక్కువ ఖర్చుతో సస్యరక్షణ చర్యలు చేపట్టి, ఎక్కువ దిగుబడులు సాధించడమెలాగో వివరించారు. కూరగాయల పంటలో సూర్య మండల్ ఆకారంలో న్యూ ట్రీ గార్డెన్స్ నమూనా తయారీ, తక్కువ స్థలంలో ఎక్కువ బెడ్స్ వేసి ఆరుతడిగా నీటిని ఆదాచేసి కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి విధానంలో సాగుచేసిన కాలుష్యరహిత పంటలతో ప్రజల ఆరోగ్యం కాపాడవచ్చని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కలిగిరి ప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రియునితో కలిసి హత్య



హతుడు పైడిరాజు, నిందితురాలు జ్యోతి

ప్రజాశక్తి - తగరపువలస : వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ భార్య, తన ప్రియునితో కలిసి భర్తను హత్య చేసిన ఘటన జివిఎంసి రెండో వార్డు పరిధి వలందపేటలో గురువారం వెలుగు చూసింది. కేసు వివరాలను భీమిలి సిఐ కె.లక్ష్మణమూర్తి గురువారం మీడియాకు వెల్లడించారు. వలందపేటకు చెందిన వంకా పైడిరాజు (34), జ్యోతి భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త పైడిరాజు కనిపించడం లేదంటూ భీమిలి పోలీస్ స్టేషన్‌లో గత నెల 30న జ్యోతి ఫిర్యాదు చేసింది. ఆమె కొద్ది కాలంగా విశాఖ నగరంలోని పెద వాల్తేరు సమీపానగల వాసవానిపాలెంనకు చెందిన వి.నూకరాజుతో వివాహేత సంబంధం కొనసాగిస్తూ వస్తోంది. ఎలాగైనా భర్తను అడ్డుతొలగించుకోవాలని భావించి గత నెల 29న మోటారు బైకుపై ప్రియునితో కలిసి ఇంటికి వచ్చింది. పథకం ప్రకారం ఇరువురూ కలిసి పైడిరాజును హత్య చేశారు. వెంటనే మృతదేహాన్ని విశాఖలోని పెదవాల్తేరు ఆర్టీసీ డిపోకు సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో దహనం చేశారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు నిందితులైన జ్యోతి, నూకరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేయాలంటూ మృతుని బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారిని కట్టడి చేసిన పోలీసులు నిందితులను విచారణ నిమిత్తం జీపులో వేరే చోటుకు తరలించారు. ఇదిలా ఉండగా నిందితురాలు జ్యోతి తాను సిబిఐలో ఉద్యోగం చేస్తున్నట్లు నమ్మబలికేదని, ఇంటికి తరచూ ఆలస్యంగా వచ్చేదని మృతుని కుటుంబీకులు తెలిపారు. అనుమానం వచ్చి విశాఖలోని సిబిఐ కార్యాలయంలో విచారణ చేయగా ఆమె చెప్పేది అబద్ధమని తేలిందని అన్నారు. మరోవైపు ఆమె కదలికలను సిబిఐ అధికారులు పసిగట్టి విచారణచేయగా అసలు విషయం బయటపడిందన్నారు.

కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-రోలుగుంట : సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామాల్లో కోడిపందాలు, జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నాగకార్తీక్ హెచ్చరించారు. సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గ్రామాల్లో, తీర్థ మహోత్సవాల్లో మద్యం తాగి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వాహనాలు నడిపినా, కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై 9490619495 నెంబర్‌కు పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని కోరారు.

గొలుగొండ : సంక్రాంతి పండుగల నేపథ్యంలో గ్రామాల్లో కోడిపందాలు, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కేడిపేట ఎస్ఐ సూర్యనారాయణ హెచ్చరించారు. సంక్రాంతి పండుగలు, తీర్థాల సందర్భంగా పోలీసుల ఆదేశాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే 9440904240 నెంబరుకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారు వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమన్నారు.

భారత్ విజయాన్ని కాంక్షిస్తూ

హాకీ క్రీడాకారుల ర్యాలీ



జాతీయ జెండా చేతబట్టి ర్యాలీ చేస్తున్న హాకీ క్రీడాకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈ నెల 13 నుంచి ఒడిశాలో జరగనున్న హాకీ ప్రపంచ కప్ పోటీల్లో భారతజట్టు విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం హాకీ క్రీడాకారులు జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ చేపట్టారు .ముందుగా జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రంజిత్, నానాజీ, ప్రసాద్, రాంచంద్రరావు పాల్గొన్నారు.

22 ఏళ్లుగా సిఐటియునే గెలుపు

- హెచ్‌పిసిఎల్ కో - ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో మళ్లీ విజయం
- పలువురి అభినందన

ప్రజాశక్తి - కలెక్టరేట్, ములగాడ : హెచ్‌పిసిఎల్ ఎంప్లాయిస్ కో - ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల్లో మళ్లీ సిఐటియునే విజయం వరించింది. 22 ఏళ్లుగా సిఐటియునే ఇక్కడ విజయ దుందుబి మోగిస్తూ వస్తోంది. బుధవారం మొత్తం తొమ్మిది డైరెక్టర్ల స్థానాలకు ఎన్నికలు జరగ్గా అన్ని స్థానాల్లో సిఐటియు బలపరిచిన అభ్యర్థులే భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ విషయాన్ని స్థానిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవిఎన్.సత్యనారాయణ మీడియాకు తెలిపారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో సిఐటియు తరుపున 9 మంది, ప్రోగ్రెసివ్ ఫ్రంట్ తరుపున 9 మంది అభ్యర్థులు పోటీలో నిలబడగా, సిఐటియు బలపరిచిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం ఓట్లు 1018 కాగా, 766 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 10 ఓట్లు చెల్లలేదు. డైరెక్టర్లుగా గెలుపొందిన చండా శ్రీనివాసులు 532 ఓట్లు, డి.సూర్యప్రకాష్ 524 ఓట్లు, బి.విజయబాబు 514 ఓట్లు, బి.పార్థసారధి 509 ఓట్లు, అరవింద్ కుమార్ 505 ఓట్లు, వివిఎస్ ప్రసాద్ 500 ఓట్లు, బి.హరికృష్ణ 496 ఓట్లు, సిహెచ్.జగదీశ్వరరావు 491 ఓట్లు, విజయ్ కుష్వహా 485 ఓట్లు పొంది విజయం సాధించారు. ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బడే శ్రీనివాస్ 11వ తేదీ రాత్రి 9 గంటలకు ఫలితాలను ప్రకటించారు. గురువారం ఉదయం 10 గంటలకు 9 మంది డైరెక్టర్లు కలిసి మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు.

కమిటీ ఇదే..

చండా శ్రీనివాసులు అధ్యక్షులుగా, బి.పార్థసారధి ప్రధాన కార్యదర్శిగా, బి.హరికృష్ణ కోశాధికారిగా, డిసూర్య ప్రకాష్ ఉపాధ్యక్షునిగా నూతన కమిటీ ఎన్నికైంది. 22 ఏళ్లుగా సిఐటియు అధ్వర్యంలోని అభ్యర్థులే ఈ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారంటే సంఘం మీద ఇక్కడి ఉద్యోగులకు ఎంతటి నమ్మకమో తెలుస్తోందని యూనియన్ ప్రధాన కార్యదర్శి కెవిఎన్.సత్యనారాయణ తెలిపారు. సిఐటియు పేనల్ అభ్యర్థులను గెలిపించిన ఉద్యోగులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



విజయోత్సవ సంబరాలు చేసుకుంటున్న సిఐటియు నేతలు, కార్మికులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వపు విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక గురువారం నిర్వహించారు. పదో తరగతి పాసైన తర్వాత ఏదో ఒక సందర్భంలో కలిసిన వాళ్ళు కొంతమంది ఉంటే మరి కొంతమంది విద్య, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో ఎక్కడెక్కడికో వెళ్ళి స్థిర పడ్డారు. దాదాపు 22 ఏళ్ల తర్వాత వాళ్లంతా పాఠశాలలో గడిపి, పూర్వజ్ఞాపకాలు, మధురానుభూతులను నెమరవేసుకున్నారు.

ప్రహసనంగా ఆర్‌డిఒ బదిలీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ఆర్‌డిఒ భవానిశంకర్‌ను మరలా బదిలీ చేసారు. గతంలోనూ భవానిశంకర్‌ను బదిలీ చేసి జయరాంను ఆర్‌డిఒగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బదిలీలను నిలిపేయడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేకు భవానీశంకర్ కొనసాగారు అయితే ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తి కావడంతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న జయరాంను నర్సీపట్నం ఆర్‌డిఒగా పోస్టింగ్ ఇచ్చి, ఇక్కడున్న భవానీశంకర్‌ను సిఎం పేషీకి బదిలీ చేశారు.


వృద్ధులకు రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న భజన మండలి

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ గ్రామంలో బుధవారం రాత్రి సత్య సాయిబాబా భజన మండలి ఆధ్వర్యంలో 20 మంది వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. సమీప గ్రామాల్లో నిరాశ్రయులకు రగ్గులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొంచెం లక్ష్మీనారాయణ, సర్పంచ్ కసిపల్లి అప్పారావు, భజన మండల సభ్యులు పాల్గొన్నారు

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన
18న కానిస్టేబుల్ మోడల్ పరీక్ష



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పోరాటాల ఫలితంగా 2022 నవంబర్ 28న రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా కానిస్టేబుల్ 6100, ఎస్ఐ 411 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, సంతోష్ అన్నారు. గురువారం ఎన్‌పిఆర్ భవన్‌లో సంఘం జిల్లా నాయకులు మురళి, గణేష్‌లతో కలిసి ఈ నెల 18న నిర్వహించే కానిస్టేబుల్ మోడల్ పరీక్ష పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా పోలీసు శాఖలో నోటిఫికేషన్ లేనందున వయో పరిమితిని ఐదు సంవత్సరాలకు పెంచాలని తమ సంఘం ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించామన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలకు వయోపరిమితి పెంచిందని తెలిపారు. ఈ నెల 22న ప్రిలిమ్స్ పరీక్షలు రాస్తున్న నిరుద్యోగులకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కెయస్.లక్ష్మణరావు సహకారంతో ప్రశ్నాపత్రం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మోడల్ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ జరుగుతుందన్నారు. హాజరయ్యే వారు పేర్లు నమోదు చేసుకోవడానికి 7671911205, 7093705799, 9493237231 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వివేకానందునికి నివాళి

డివైఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. పోటీ పరీక్షల అధ్యాపకులు డాక్టర్ జికె.నాయుడు ముందుగా స్వామి వివేకానంద పటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశం ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానందుడని, ప్రపంచ వ్యాప్తంగా యువకులందరికీ ఆయన సందేశాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు, జిల్లా నాయకులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పండగకు పటిష్ట నిఘా



ఎంఎస్‌పి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రజలందరూ పండగలు ఆనందంగా జరుపుకోవాలని ఎఎస్‌పి ప్రవీణ్ కుమార్ సూచించారు. ఎస్‌పి గౌతమిశాలి ఆదేశాల మేరకు పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట భద్రత,నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోడిపందేలు, జూదం గుండాటలు, ఇతర అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని కోరారు.

స్వామీజీ రాజకీయ ఆరోపణలపై అభ్యంతరం

ప్రజాశక్తి -కొత్తకోట : రాజకీయ విమర్శలు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగీకునిపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన రావికమతం మండలం టి. అర్జాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండగను పురస్కరించుకొని సమరసతా పౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం టి.అర్జా పురం ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం ఆనంద్ ఆశ్రమాధిపతి, ఉత్తరాంధ్ర సాధువు పరిషత్ అధ్యక్షులు, శ్రీనివాసానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వ పాలనపై, స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీ పనితీరుపై విమర్శలు చేయడంతో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్వామిజీ ప్రసంగాన్ని మధ్యలోనే ముగించారు.

'యువశక్తి'కి తరలివెళ్లిన జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి -నక్కపల్లి : శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జనసేన యువశక్తి మహా గర్జన సభకు మండలంలోని పలు గ్రామాల నుండి భారీగా జనసైనికులు గురువారం బస్సుల్లో తరలి వెళ్లారు. కాగిత ఎంపిటిసి ఆకేటి గోవిందరావు , జన సైనికులు పిక్కి స్వామి, అప్పలరాజు, గరగా సూరిబాబు , తోట అప్పారావు, నూకరాజు వెళ్లిన వారిలో ఉన్నారు.

ముసుగేసిన పొగమంచు



కోటవురట్లలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

ప్రజాశక్తి- కోటవురట్ల :మండలంలో గురువారం మంచు ముసిగేసింది. తెల్లవారుజాము నుండి ఉదయం 9 గంటలకు మంచు దుప్పటి కప్పేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు, వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు, మంచుకు తోడు చలి తీవ్రత తోడవవ్వడంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. చలి తీవ్రత నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

'రియల్ దందా'పై విచారణ

- 'ప్రజాశక్తి'కథనానికి స్పందన
- కదిలిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు
- ప్రాథమిక స్థాయిలో అక్రమాల నిర్ధారణ
- సమగ్ర సర్వే అనంతరం దందా కొలిక్కి
- కలెక్టర్‌కు నివేదిస్తాం : తహశీల్దార్

ప్రజాశక్తి-కొత్తకోట : రియల్ ఎస్టేట్ ముసుగులో ప్రభుత్వభూములు, ఆస్తుల కబ్జా ఆరోపణలపై అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం ప్రజాశక్తిలో రియల్ దందా శీర్షికతో వచ్చిన కథనానికి తహశీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్, సర్వే బృందం తట్టబంద రెవెన్యూ పరిధి పొర్లుపాలెం గ్రామంలోని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రాంగణాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సుమారు 60 ఎకరాలకు ఎన్‌ఒసి పొందిన రియల్ ఎస్టేట్ సంస్థ, ఆ భూమిని ఆనుకుని ఉన్న డీఫారం పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూములు, చెరువు, సాగునీటి చెక్‌డ్యామ్‌లు, కొండవాగులు, గెడ్డలు, చివరకు శ్మశానాన్ని సైతం సుమారు 36ఎకరాలను కలిపేసుకుందని స్థానిక గిరిజనులు ఆరోపిస్తూ మంగళవారం ఆందోళన చేపట్టారు. దీనిపై ప్రజాశక్తితో పూర్తి వివరాలతో కథనాన్ని వెలువరించగా అధికారుల్లో కదలిక వచ్చింది. తహసీల్దార్ మహేశ్వరరావు, ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆ ప్రాంతాన్ని సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోకివాడ రమణ సమక్షంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. తహశీల్దార్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేటు భూముల్లోకి గెడ్డలు, చెక్ డామ్‌లు కప్పేసి కలుపుకున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చామని, దీనిపై సమగ్ర సర్వే చేయాల్సి ఉందన్నారు. గిరిజనులకు కొండకు వెళ్లే మార్గాన్ని చూపిస్తామన్నారు. శ్మశానవాటికను గుర్తించి, గిరిజనులకు అప్పగిస్తామన్నారు. రామాలయం నుంచి ప్రభుత్వ భూమి ఉన్నట్టుగా కొద్ది మేర గుర్తించామన్నారు. డీఫారం పట్టా భూములు ఆక్రమణకు గురైతే వాటిని తిరిగి లబ్ధిదారులకు అందిస్తామన్నారు. భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపి, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు గిరిజనులు ఆందోళన చెందవద్దన్నారు. చెక్‌డ్యామ్‌ల వివరాలను ఇరిగేషన్ అధికారుల నుంచి సేకరించి, వాటినీ స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గిరిజనుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ చినబ్బాయి, సర్వేయర్ భోగేష్ , మండల సర్వేయర్ రొంగళి సత్యనారాయణ, వీఆర్వో గెంజి వెంకటరమణ గ్రామస్తులు వై ఈశ్వరరావు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గిరి మహిళలు